# అరవింద

"నేను పెళ్ళి చేసుకుంటాను!" అరవింద చెప్పింది. అందరూ అదిరిపోయారు. నిశ్చేష్టులై నిల్చుండిపోయారు. తమ చెవుల్ని తామే నమ్మలేకపోతున్నారు.

"ఏమంటున్నావమ్మా!" విస్మయంగా అడిగాడు తండ్రి పరమేశ్వరశాస్త్రి.

"నేను తెనుగులోనే చెప్పాను!" ముక్తసరిగా అంది.

"ఛీ! బోడిముండా! ఇది నీకు పుట్టిన బుద్ధేనా?" తిరస్కారంగా – ఏవగింపుగా మొహం పెట్టి అంది తల్లి గంగ.

"అమ్మా! నువ్వు ఇప్పుడన్నావే ఓ మాట! అది అందరూ అనకుండా వుండాలంటే నేను పెళ్లి చేసుకోవాలి." శాంతంగా చెప్పింది అరవింద.

"అయ్యో! అయ్యో! మన వంశం ఏమిటి? మనమేమిటి? మన సంప్రదాయం ఏమిటి? మొగుడు చచ్చి మూడు నెల్లు కూడా కాలేదు ....పెళ్ళి చేసుకుంటుందా!" అమ్మమ్మ అరుంధతి నోరు నొక్కుకుంటున్నది

"మంచిది – నేను – చేసుకోను – ఎవరు నన్ను ఆదుకుంటారు!" విరక్తిగా అంది అరవింద.

"మేమంతా లేము!" ఆశ్చర్యంగా తల్లిగంగ చెప్పింది.

"ఏం చేసుకోను? నా కష్టసుఖాల్లో తోడుగా వుంటారా?"

"అందుకేగా వచ్చింది"..తండ్రి పరమేశ్వర శాస్త్రి చెప్పాడు.

"హూ! ఫోనుల మీద ఫోన్లు ఉత్తరాల మీద ఉత్తరాలు రాస్తే ఇప్పుడు వచ్చారు. ఎన్నాళ్ళుంటారూ? రేపీపాటికి పోరా!"

"ఏం పెడసరం – మేము వెళ్ళినా నిన్ను తీసుకుపోతాం ..ఇక్కడ వుండి నువ్వేం చేస్తావు?" తల్లి గంగ అంది.

"పిల్లల చదువులు ఏమవుతాయి?"

"ఏం పిల్లలే – బోడిచదువులు – మహాకాలేజీలు వెలగబెడుతున్నారా? కాన్వెంటు స్కూలేగా ....ఇక్కడ కాకపోతే అక్కడ చేరుతారు ఆ బోడి చదువులు!" తేల్చి చెప్పింది గంగ.

"ఎవరి చదువులు వాళ్ళకు ముఖ్యం! ఆ ఊళ్ళో ఇక్కడున్నంత మంచిగా చదువులు ఎక్కడున్నాయి? పిల్లలకు చిన్నప్పుడే ఫౌండేషన్ పడాలి." ఖండించింది అరవింద.

"అయితే ఏమంటావే! మనూరికి రానంటావా?" తల్లి

"ఊహూ! ఇక్కడే వుంటా...."

"ఒంటరిగా ..." తండ్రి.

"కాదు... పెళ్ళి చేసుకుంటా!?" అరవింద.

"ఛీ! మళ్ళీ అదే కూత – సిగ్గు లేదు ముగ్గురు పిల్లల తల్లివి! అల్లుడు పోగానేఒళ్ళు తిమ్మిరెక్కిందా? ఎవరైనా వింటే నవ్విపోతారు"? పరమేశ్వరశాస్త్రికి కోపం నసాళానికి అంటింది.

"సరే... పెళ్ళి చేసుకోకుండా చాటుమాటు వ్యవహారం జరపమంటారా!" సూటిగా

అడిగింది అరవింద.

"అదేం మాటలే! నీ దుంపతెగ... మీ ఆయన పోయి మూడు నెలలు కాలేదు... ఎంత మాటలు?" తల్లి వాపోయింది.

"ఏం! ఒకవేళ నేను పోయి వుంటే - ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకుని వుండేవాడు కాదా?" అరవింద నిలదీసింది.

"ఏమో! కాని ఆయన మగమహారాజు పిల్లల్ని పెంచలేక-చేసుకోవాలనుకుంటాడేమో!" అమ్మమ్మ చెప్పింది.

"ఆ! అదే - నేను చేస్తున్నది... ముగ్గురు పిల్లల్ని ఒంటరిగా పెంచడం నావల్ల ఏమవుతుంది? వాళ్ళను స్కూళ్ళకు పంపడానికి - ఫీజులు కట్టడానిక్కి.... సీట్ల కోసం తిరగడానికి... ఒక మొగ పీనుగ తోడుంటే బాగుంటుందిఏమో! పిల్లలకి"అరవింద చెప్పింది

"జీతగాడు కావాలంటే ఎవరినన్నా చూస్తాలేవమ్మా - దానికోసం పెళ్ళి చేసుకోవాలా!" తండ్రి బాధగా అన్నాడు.

"నా వయసెంత నాన్నా! పట్టుమని పాతిక! ఆయన తొందరపడి ముగ్గురు పిల్లల్ని నా మొహాన పడేసి వెళ్ళిపోయారు. నేనూ ఉప్పు, కారం తింటున్నా - నాకు కోరికలుంటాయి..." కొంచెం తలొంచుకుని చెప్పింది.

"ఈ ఏడేళ్ళ సంసారంలో ఆయన్ని ప్రేమించింది ఇంతేనా!" తల్లి గంగ అడిగింది.

"ఆ! మనస్ఫూర్తిగా ప్రేమించాను - ఏడు సంవత్సరాలు ఏడు రోజుల్లా గడిచిపోయాయి" బాధగా చెప్పింది.

"మరి మళ్ళీ పెళ్ళి అంటావేమిటే!" ఆశ్చర్యంగా అడిగింది గంగ.

"పోయిన వాళ్ళతో మనం పోగలమా! ఒకవేళ నేను పోదామనుకున్నా నా పిల్లలు ఏమవుతారు?" కన్నీరు తుడుచుకుంటూ అడిగింది అరవింద.

"అమ్మా! నువ్వు ఏం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావడం లేదు. అల్లుడుగారు చనిపోయిన షాక్‌లో నీ మతి చలించినట్టుంది. రెండో పెళ్ళి మగాడికి చెల్లుతుంది కాని ఆడపిల్లకు కాదమ్మా!" తండ్రి చెప్పాడు ఓదార్పుగా.

"ఎందుకు నాన్నా! మనం మనుషులం కాదా! మనకు రక్త మాంసాలుండవా?" అమాయకంగా అడిగింది.

"ఏంటే! నీలుగుతున్నావు -నాలుగు తగలనిస్తే తెలుస్తుంది... అమ్మా... బుజ్జి అంటూ చెబుతుంటే అర్థం కావడం లేదు". తల్లి గంగ గయ్‌మని లేచింది.

"అమ్మా! నా బాధ నీకు అర్థం కాదులే . నీకూ నాలాంటి కష్టం వచ్చి వుంటే అర్థం అయ్యేది..." తీవ్ర స్వరంతో చెప్పింది.

"నీ దుంపతెగ - ఎంత మాటన్నావే! ఎన్నో జన్మలు పాపం చేసుకుని పుట్టావు - అనుభవిస్తున్నావు - మధ్యలో నీ కళ్ళు నా మీద పడ్డాయి ముదనష్టపు పీనుగా! నువ్వు ఎలాపోతే నాకేమే! ఏదో కన్న కడుపుకదాని చెప్పాను". ఏడుస్తూ అరిచింది గంగ.

పరమేశ్వరశాస్త్రి ఖంగుతిన్నాడు.

"నాన్నా! మీరు చూస్తారా?" అరవింద అడిగింది.

"మా వల్ల కాదమ్మా!"

"అయితే రేపు నన్ను సాధించవద్దు – నా సెలక్షన్ బాగోలేదని ... నేనే వెతుక్కుంటా". చెప్పింది.

"ఛీ !ఛీ! నీకు పెళ్ళేమిటి అయినా నిన్ను ఎవడు చేసుకుంటాడే మొగుడు చచ్చిన ముండవి!" తల్లిగంగ ఆక్రోశం.

"ఆ!నాకేం తక్కువ – వయసుంది – సొగసుంది... ఆయన ఆస్థి వుంది...చాలదా!"

"ఆ! దాంతో పాటు ముగ్గురు పిల్లలు కూడా వున్నారు. చెడిన తల్లీ వుంది..." చెప్పింది అమ్మమ్మ.

"స్త్రీకి స్త్రీయే శత్రువు ? నా నిర్ణయాన్ని హర్షించి – నావెనుక నిలబడవలసింది పోయి కన్న తల్లి నువ్విలా మాట్లాట్టం ఏం బాగోలేదు. ఐ డోంట్ కేర్!" అరవింద చెప్పింది.

"ఇలాంటి కొంపలో ఒక్క క్షణం వుండం!" గంగ.

"మంచిది ...వుండమని ఎవరూ అడగరు."

"అరూ! నువ్వు కనుక పెళ్ళి చేసుకుంటే నీ మొహం ఇంక ఈ జన్మలో చూడం!" పరమేశ్వర శాస్త్రి చెప్పాడు.

"మీ ప్రేమ అంతే అనుకుంటా!"

"ఆలోచించు ... అత్తింటి వాళ్ళు రారు – పిల్లలకు సపోర్టుండదు... " గంగ.

"ఆయన తోనే ఆ సంబంధం పోయింది. కొడుకు పోగానే అత్తింటి వాళ్ళు పట్టించుకోవటం మానేశారు. పైగా ఆయన పోవడానికి కారణం నా దరిద్ర జాతకం అని అంటున్నారు. అందుకే నాకు పట్టుదల పెరిగింది ...ఎవరిది దరిద్ర జాతకమో తేలుస్తాను. .వాళ్ళ కళ్ళ ముందే కళకళలాడుతూ తిరుగు తాను!" అరవింద రోషంగా చెప్పింది.

"హూ! బరితెగించింది!" అమ్మమ్మ నోరు నొక్కుకుంది. "ఇవేం పెంపకాలో దరిద్రం పెంపకాలు!"

"అది గాదే ..నువ్వు చేసుకునేవాడు నిన్ను చూసి చేసుకుంటాడా? – నీ ఆస్తి కోసం చేసుకోవచ్చు,తరువాత నీ పిల్లల్ని మెడ పెట్టి గెంటొచ్చు. నిన్ను వదిలేయవచ్చు." తల్లి అస్త్రం వేసింది.

"ప్రతి పెళ్ళిలో ఆ మాత్రం రిస్కు వుండనే వుంటుంది నా జాగ్రత్తలో నేను వుంటాను. పెళ్ళికి ముందు అన్నీ మాట్లాడుకునే నిర్ణయానికి వస్తాం."

"అయితే మేమెవరం నీకు అక్కరలేదన్నమాట "...తండ్రి.

"అలా అని నేను అనలేదు – మీరే అనుకుంటున్నారు."

"నలుగురూ మీ మొహాన ఉమ్మేసేట్టు బ్రతుకుతావు – ఛీ! అయినా ఈ ఆస్తి ఆయనది కదే – ఆయన తరువాత నీ పిల్లలకు చెందుతుంది."

"కొంత – కొంత నాది కూడా – మరి ఆయన నన్నిలా అర్థాంతరంగా – అధోగతిలో పడేసిందానికి నష్టపరిహారం కావాలిగా .. అందుకే – ఆ ఆస్తి నాది కూడా!" అరవింద చలించలేదు.

మూడు నెలల క్రిందటి దాకా ఆమె చాలా అదృష్టవంతురాలు. ఆమె భర్త డాక్టర్ శైలేంద్ర ఆమెను ఎంతో ప్రేమించేవాడు. వారిద్దరిది అపురూప దాంపత్యం. ఎంత బిజీ ప్రాక్టీసు వున్నా ఆమెని అతడు నిర్లక్ష్యం చేసేవాడు కాదు. షికార్లు - సినిమాలు - వినోదాలు, పర్యటనలు వారి జీవితంలో ఎంతో క్రమంగా పాలుపంచుకున్నాయి.

పరమేశ్వరశాస్త్రి గంగలు కూడా అల్లుడ్ని కూతురు కంటే ఎక్కువగా అభిమానించేవాళ్ళు. ఇంత మంచి అల్లుడు ఈ కాలంలో దొరకటం తమ అదృష్టంగా భావించేవారు.

కాని విధి వెక్కిరించింది.

ఓ బస్సు ప్రమాదంలో మరణించేడు శైలేంద్ర. ఆఫీసు పని మీద హైదరాబాద్‌కు పోయి... తిరిగివస్తూ... ఇంటికి తిరిగిరాలేదు.

అతని శవాన్ని అంబులెన్సులో ఇంటికి తీసుకువచ్చేసరికి అరవింద షాక్ తిన్నది. అతను చనిపోయాడని ఎంతకూ నమ్మలేకపోయింది.

తనలో తాను నవ్వుకోవడం... కళ్ళు తుడుచుకోవడం... శూన్యంలోకి చూస్తూ వుండడం నిజంగా అతను చనిపోయాడాని తర్కించుకోవడం చేసేది.

ఆమె తల్లిదండ్రులు ఓ పది రోజులు ఆమెను దూరంగా తీసుకుపోయి ఆమె ధ్యాస మళ్ళించి తెచ్చారు.

కాని ఆమెలో ఒంటరితనం ఎక్కువై పోయింది. పిల్లలు తండ్రిని మర్చిపోయినంత తొందరగా తను భర్తను మర్చిపోలేదుగా.

తను గడపవలసిన కాలం - భవిష్యత్తు తలచుకుంటే భయం వేస్తున్నది.

తన ముందున్న బాధ్యతలు గుర్తుచేసుకుంటే జీవితమంటే భయంకలుగుతున్నది.

అందుకే... ఆమె... ఆ నిర్ణయం తీసుకుంది.

తగూలాడి తల్లిదండ్రులు వెళ్ళిపోయిన మరునాడే మ్యారేజీ బ్రోకరు సుధాకర్‌ను ఇంటికి పిలిపించింది.

"సారు! ఎంత మంచివారమ్మా! అన్యాయం చేసిపోయారు". సుధాకర్ బాధపడ్తూ చెప్పాడు కాఫీ తాగి.

"మీరు సంబంధం చూడాలి." చెప్పింది.

"ఎవరికి?"

"నాకే."

"ఆఁ! మీకా!" నోరు తెరిచాడు ఓ అయిదు నిమిషాల వరకు తేరుకోలేకపోయాడు.

"ఏం! అంత ఆశ్చర్యం! కాటికి కాళ్ళు చాపుకున్న అరవైయేళ్ళ ముసలి మొగుళ్ళకు కూడా మూడో సంబంధం కుదురుస్తారే! నాకేం తక్కువైందని! అందం - వయసు - ఆస్తి...."

"ని ని నిజమే ...నిజమే !" నాన్చాడు .

"అందుకే నాకు తగ్గ సంబంధం చూడండి .మీ కమిషన్ మీకు అందుతుంది."

"కాని కాని ..పిల్లలు!" సుధాకర్ అయోమయం ....

"ఏం! పిల్లలున్న మొగుడ్ని ఆడాళ్ళు చేసుకోవడం లేదా... అలాగే..."

"మీకు ఫస్టు హ్యాండ్ మ్యాచ్ దొరకడం కష్టం..."

"ఓకే. దొరికితే మంచిదే - లేదా నాలాగే తలచెడిన మొగాళ్ళుంటారుగా - ాళ్ళయినా - డైవర్సు ఇచ్చిన మొగాళ్ళయినా ఫర్వాలేదు." చెప్పింది.

"ఒకవేళ వాళ్ళకు పిల్లలుంటే....."

"వద్దు ... బాధ్యతలు లేని మొగాడు కావాలి... ఇప్పటికే నాకు ముగ్గురు పిల్లలు - ుళ్ళీ మాకు కనీసం ఇద్దరు పుడతారు- అతనికి ఆల్‌రెడీ ఇద్దరుంటే మొత్తం ఏడుమందిని ంచడం కష్టం - సో బాధ్యతలు లేని వాళ్ళయితే మంచిది...." అరవింద వివరించింది.

బ్రోకరు వెళ్ళిం తర్వాత పెద్ద కూతురు రోజా అడిగింది. "అమ్మా నువ్వు నిజంగా ళ్ళి చేసుకుంటావా?"

"ఏం చేసుకోకూడదా?"

"ఊహూ! వద్దు ..." రోజా

"ఎందుకని ?"

"ఇంకో నాన్నని ఊహించలేం!"

"ఒకవేళ నేను పోయి వుంటే ...మీ నాన్న ఇంకో అమ్మని తెచ్చేవాడుగా... అప్పుడేం ేసేదానివి."

"వద్దని చెప్పేదాన్ని"

"కాని మీ నాన్న నీ మాట వినడుగా..."

"ఏడుస్తాను..."

"ఇప్పుడూ అదే చెయ్యి."

రోజా అలిగింది - ఏడ్చింది - అరవింద "బుజ్జీ నేను పెళ్ళి చేసుకునేది మీ భవిష్యత్తు ోసమేనమ్మా ! సొసైటీలో మగాడి తోడులేంది చాలా పనులు కావమ్మా! మీ బంగారు భవిష్యత్తుకోసమే నేను ఏ పని చేసినా. రేపొద్దున నాకేమన్నా అయితే మీరంతా దిక్కులేని ాళ్ళయిపోతారమ్మా!"

"తాత వున్నాడుగా - "

"పిచ్చి బుజ్జీ - ఆయన ఎంతకాలం బ్రతుకుతాడమ్మా! మహా అయితే రెండేళ్ళు... ఆ తర్వాత..."

"బాబాయిలున్నారుగా..."

"ఊహూ! ఎవరి బ్రతుకు వారిది... ఎంత సేపటికి నీ ఆస్తి కొట్టిపారేద్దామని చూస్తారు కాని నీ బాగు చూడరమ్మా!"

"అయినా నాకు ఇంకో నాన్న వద్దు..."

"నోర్ముయ్! అమ్మ కావాలనుకుంటే నోర్మూసుకుని కూర్చో - లేకపోతే హాస్టల్లో చేర్పించేస్తా!" మొత్తానికి అరవింద మూడు రోజుల్లో పిల్లలకు నచ్చచెప్పగలిగింది.

అరవింద తల్లిదండ్రులు - ఆమె అత్తామామలకు ఈమె నిర్ణయం తెలియచేశారు.

ఓ రోజు వాళ్ళు దిగి నానా యాగీ చేసి వెళ్ళారు. నీకూ మాకూ సంబంధాలుండవన్నారు, ఆస్తి మీద నీకు హక్కు లేదన్నారు. కోర్టుకెక్కుతామన్నారు. పిల్లల్ని

తీసుకుపోతామన్నారు.

అన్ని బెదిరింపులకు ఒకే సమాధానం!

"ఈ జీవితం నాది - దీన్ని అనుభవించే హక్కు నాకుంది... మీ కిష్టం లేదా... మీ దారి మీది నా దారి నాది!"

చివరికి బరితెగించిన ఆడది అన్న ముద్ర వేశారు. ఇరుగుపొరుగు వారికి ఈ గొడవలు తెలిసిపోయాయి. ఆమెనో వింత పశువును చూసినట్టు చూడసాగారు.

కొందరు ఆకతాయి వెధవలు చాటుమాటు మాటలు అనడం మొదలెట్టారు.

అరవింద నోరు చేసుకునే సరికి పక్కకి తప్పుకున్నారు.

ఈలోగా బ్రోకరు సుధాకర్ కొన్ని నాసిరకం సంబంధాలు తెచ్చాడు. చూడకుండానే తిరస్కరించి పంపించేసింది.

చివరికి గుప్తంగా పేపర్లో ప్రకటన ఇచ్చింది. ఓ అయిదారు సంబంధాలు వచ్చాయి. వాటిల్లో ఒకటి ఎన్నుకొని లెటర్ రాసింది.

అనిల్ ఆ లెటర్ పట్టుకుని వచ్చాడు చూడడానికి. ఓ రోజు కాలింగ్ బెల్ మోగింది. వెళ్ళి తలుపు తీసింది -ఎదురుగా ఆగంతకుడు. "ఎవరు కావాలి?" అరవింద.

"మీ సిస్టరు వుందా?" అనిల్ లోపలికొస్తూ అడిగాడు.

"మీరు?"

"అనిల్ అంటారు... మీ అక్క ఉత్తరం రాసింది, ఆమె వుందా?" అసహనంగా అడిగాడు ఆమెను చూస్తూ.

"నాకు అక్కలు ఎవరూ లేరు... నా పేరే అరవింద."

"యూ... బొట్టు..." ఆశ్చర్యపోయాడు.

"ఓ! మీరు మొగాళ్ళే కదూ.... విడో అనంగానే తెల్లచీర కట్టుకుని మొహం మీద బొట్టు లేకుండా - బోసి చేతులతో వున్న ఓ విధవరాల్ని ఊహించుకున్నారు కదూ!" నవ్వింది అరవింద.

"మీ భర్త చనిపోయాడు కదూ!"

"యస్! కాని, నా భర్తతో నాకు పసుపు కుంకుమలు రాలేదు పోవడానికి.ఆయనతో వచ్చింది ఒక తాళి మాత్రమే - అది మటుకు తీసి పారేశాను ..." లోపలికి వెళ్ళి మంగను ఫలహారాలు తెమ్మని చెప్పింది. కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా దొర్లాయి.

"మీరు ఇంత హఠాత్తుగా వస్తారనుకోలేదు. మీరు వచ్చే డేటు ముందు తెలియచేస్తే మా పెద్దల్ని పిలిపించేదాన్ని." సిగ్గుపడ్తూ చెప్పింది.

మంగ ఫలహారం ఇచ్చి వెళ్ళింది.

"సర్ ప్రైజ్ చేయడం నాకు అలవాటు!" అనిల్ చెప్పాడు ఫలహారం తీసుకుంటూ

"మీ గురించి చెప్పలేదు..." గోముగా అడిగింది.

"ఏముంది నేనొక ఇంజనీరును! మంచి జీతం మంచి హోదా.!"

"అది కాదు ..మీ వైవాహిక జీవితం గురించి ."

"ఓ నేను డైవర్సీని.... ఒక సారి కాదు ..రెండు సార్లు..." చెప్పాడు తాపీగా.

భయంగా కళ్ళెత్తి అతని వంక చూసింది.

"అందులో నా తప్పేం లేదు-సావిత్రి పెళ్ళికి ముందే ఎవరినో ప్రేమించింది. అతన్నే తలచుకుంటూ వుంటే.... అతన్ని పెళ్ళి చేసుకోమని విడాకులిచ్చాను సునంద బాగుండేది..కాని...ఆమె క్యారెక్టర్ మంచిది కాదు. ఓ రోజు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాను..దాంతో విరక్తి పుట్టి డైవర్సు ఇచ్చాను." బాధగా చెప్పాడు.

"నాకు ముగ్గురు పిల్లలు - మీకు అభ్యంతరమా?"

"నాకెందుకు అభ్యంతరం? రెడీమేడ్ చిల్డ్రన్?" నవ్వాడు.. ఆమె శృతి కలిపింది.

ఓ నెలలోనే వారిద్దరి పెళ్ళి అయిపోయింది సింపుల్‌గా-ఆమెవైపు వాళ్ళు, అటువైపు వాళ్ళు - ఇటు వాళ్ళు ఎవరూ రాలేదు - కొలీగ్సు తప్పించి.

శోభనం రాత్రి అనిల్ అపురూపంగా అరవిందను గుండెల కదుముకున్నాడు.

అరవింద కళ్ళు వర్షించాయి.

"ఎందుకు ఏడుస్తున్నావు?" అడిగాడు.

"డాక్టర్ శైలేంద్ర గుర్తుకువచ్చాడు." చెప్పింది.

"ఆయన్ని మర్చిపోలేనప్పుడు నన్నెందుకు పెళ్ళి చేసుకున్నావు?" కోపంగా అడిగాడు.

"ఆయన్ని మర్చిపోదామనే - చేసుకున్నా!"

"అంతగా ఆయన్ని ప్రేమించేటపుడు ఇంకో పెళ్ళి ఎందుకు చేసుకోవాలి" చికాకుగా అడిగాడు.

"ఈ జీవితం నాది కాబట్టి - ముందుకు నడిస్తేనే జీవితం! చనిపోయిన వాళ్ళకోసం ఆగిపోతే మన జీవితం నాశనమైపోతుంది-బాధో....కష్టమో...పాత జ్ఞాపకాలను చెరిపివేస్తూ ముందుకే నడవాలి-బ్రతుకు పండాలంటే!" అరవింద.

అనిల్ - అరవిందను దగ్గరికి తీసుకున్నాడు ఆరాధనతో.

(12మే 2001 సుప్రభాతం వీక్లీ)

